క్లుప్తంగా

‘ఫీవర్’లో రోగులకు పండ్ల పంపిణీ

నల్లకుంట: ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, టీటీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి మరిన్ని నిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన సుందరయ్య పార్కు అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం సుందరయ్య పార్కులో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే రూ.80 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



పైపులైన్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. గురువారం చెప్పల్‌బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులను జలమండలి ఏఈ భావన, సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మల్లిఖార్జున్, బి.భీమ్‌రాజ్, శంకర్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళికి అవార్డు



అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం పోలీసులకు ప్రతిష్ఠాత్మకంగా అందించే ఉత్కృష్ణ సేవా పతకం అబర్‌పేట పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి.చంద్రమౌళికి లభించింది. విధి నిర్వహణలో చంద్రమౌళి అందించే సేవలు, ప్రతిభను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా అత్యుత్తమ సేవలందించే పోలీసులకు ఈ అవార్డు అందజేస్తారన్నారు.

‘నన్నెచోడుడు’ సంస్మరణ సభ

చిక్కడపల్లి: వేయి సంవత్సరాల క్రితం చారిత్రక ప్రబంధకవి నన్నెచోడుడును స్మరించుకోవడమంటే తెలుగు భాషా ఔన్నత్యాన్ని గుర్తుచేసుకోవడమేనని రాష్ట్ర ఎస్సీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం కళాసుబ్బారావు కళావేదికలో శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమాల భాగంగా నన్నెచోడుడు సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ రాజ శిఖామణిగా ఖ్యాతి చెందిన ఆయన కాళిదాసు కుమార సంభవం సంస్కృత కావ్యాన్ని తెలుగులోకి అచ్చతెలుగు పదాలతో అనువదించారన్నారు. కవి తంగిరాల చక్రవర్తి, సూరి భగవంతం, ట్రస్ట్ ప్రతినిధి ఎస్‌బి రామ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ముషీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పారిశుద్ధ్య కార్మికుడు డి.శంకరయ్యకు రూ.52వేలు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ చెక్కును బీఆర్ఎస్ నాయకులు గురువారం లబ్ధిదారుడికి అందజేశారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



ముషీరాబాద్: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డేవిడ్, రెవరెండ్, పాస్టర్ మరిదాస్‌లు ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

కరోనా బాధితులను దిల్‌తో చూశా!

- సమాజం ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నా
- రెండేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నా
- నేటితో సూపరింటెండెంట్‌గా రాజారావుకు మూడేళ్ల పూర్తి



కరోనా సమయంలో పీపీఈ కిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి : ఆప్యాయత, అనురాగం, అనుబంధాలే ముఖ్యమని, మానవ సంబంధాలకు విలువ కట్టలేమని, కరోనా విజృంభించిన సమయంలో ఈ సంబంధాలు ఎంతగా విచ్ఛిన్నం అయిపోయాయో, తర్వాత మనుషుల మధ్య అంతగా పెనవేసుకున్నాయి. కరెన్సీ కట్టలు, ఎకరాల భూమి, బంగ్లాలు, విలాసవంతమైన జీవితం తలకిందులైపోయాయి. కొంతమంది ధనిక బాధితులు ప్రాణం నిలబెడితే కోట్లాది రూపాయలు, విలువైన ఆస్తులు ఇస్తామని ప్రాధేయపడ్డారు. చిల్లిగవ్వ కూడా వెంట తీసుకు వెళ్లలేకపోయారు. కరోనా మహమ్మారి అనేక కుటుంబాలను తలకిందులు చేసున్న సమయంలో గాంధీ వైద్యులు, సిబ్బంది ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించి లక్షలాది మందికి పునర్జన్మ ప్రసాదించారని నాటి ఘటనలను గుర్తు చేసుకున్నారు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు. మూడేళ్ల క్రితం 2020 ఎప్రిల్ 20న సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందడంతో ఈ క్లిష్టసమయంలో పదవికి న్యాయం చేయగలనా అని ఆలోచించాను. అప్పటి వైద్య మంత్రి, ఉన్నతాధికారులు, తోటి వైద్యులు వెన్నుతట్టి ప్రోత్సాహించడంతో రంగంలోకి దిగాను. ఈ 36 నెలల్లో 20 నెలలు గాంధీ ఆస్పత్రి కోవిడ్ నోడల్ సెంటర్‌గా ఉంది. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు. పీపీఈ కిట్ వేసుకుని వార్డుల్లోకి వెళ్లి కరోనా బాధితులను స్వయంగా కలిసి ఆప్యాయంగా పలకరించి ధైర్యం చెప్పేవాడిని. మందులు లేని తరుణంలో స్టెరాయిడ్స్‌తో కరోనాను నియంత్రించవచ్చని చెప్పాను. కొన్ని నెలల తర్వాత అమెరికా జరిపిన పరిశోధనలో అదే నిజమని తేలింది.

యాడ్ చేస్తే రూ. కోట్లు ఇస్తామన్నారు..

కరోన సమయంలో కొన్ని ఫార్మాస్యూటికల్, శానిటైజర్ కంపెనీలు తమ ప్రొడక్ట్‌కు సంబంధించి మీతో యాడ్ తీస్తామని కోట్లాది రూపాయలు ఆఫర్ చేశాయి. చికిత్స పొందుతున్న కొంతమంది బాధితులు ప్రాణాలు కాపాడితే డబ్బులు, ఆస్తులు ఇస్తామన్నారు. అన్ని ఆఫర్‌లను సున్నితంగా తిరస్కరించాను. కరోనా పాండమిక్ సమయంలో వైద్యసేవలు అందించడం ఒక ఎత్తయితే, వైరస్ అనుపానులు తెలుసుకోవడం మరో ఎత్తు. కరోనా జెనెటిక్ స్టడీలో భాగంగా జీనోమ్ సీక్వెన్సింగ్‌లో రూపాంతరం (మ్యూటేషన్) చెందిన పది రకాల కరోనా సబ్ వేరియంట్లను కనుగొన్నారు. వీటిలో రెంటింటికి ఎమ్ఆర్ఆర్ (ఎం.రాజారావు) పేరు పెట్టారు. మరో రెండు వేరియంట్లకు గాంధీ వైద్యులు నాగమణి, త్రిలోక్‌చందర్ పేర్లు పెట్టారు.

బాధ్యతగా భావిస్తున్నా..



సమాజం ఇచ్చిన బాధ్యతను సక్రమంగా తీర్చుకుంటున్నాను. కరోనా సమయంలో రోజుకు 16 నుంచి 18 గంటలు విధుల్లో ఉన్నా. గైనకాలజీ, డెర్మటాలజిస్ట్ అయిన భార్య డాక్టర్ పాయల్, పిల్లలు అందించిన ప్రోత్సాహం మరువలేనిది. నా ఫొటోలకు పూలు, పాలాభిషేకాలు చేశారు. ఇప్పటికీ చాలా మంది ఇళ్లలో నా ఫొటోలు పెట్టుకోవడం దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తా. సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు, ఇతర వైద్య ఉన్నతాధికారులు, తోటి వైద్యులు, సిబ్బంది అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు.

తరిగిపోతున్న ప్రకృతి సంపద

- కాలుష్యకారకమవుతున్న వాహనాలు
- భవిష్యత్ అంధకారమేనంటున్న పర్యావరణ వేత్తలు



కార్యక్రమంలో పాల్గొన్న పర్యావరణ వేత్తలు జస్రాజ్ శ్రీమల్‌జీ, ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి

కాచిగూడ: ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవజీవితమే అస్తవ్యస్తమవుతుందని ప్రముఖ పర్యావరణ వేత్తలు జస్రాజ్ శ్రీమల్‌జీ, ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి అన్నారు. ఎర్త్ డే ని పురస్కరించుకుని గురువారం కాచిగూడలోని మార్వాడి శిక్షా సమితి (ఎంఎస్ఎస్) లా కళాశాల, ఆర్‌జీ కేడియా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూర్, కోల్‌కత్తా, ముంబై వంటి మెట్రో పాలిటన్ నగరాలు తీవ్రమైన కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నాయని, ఫలితంగా నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, ఏర్పడి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ లా కాలేజీ కార్యదర్శి సురేంద్ర లూనియా, సంయుక్త కార్యదర్శి సీఏ ఎస్‌బి కాబ్రా పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఓయూ కామర్స్ విభాగం డాక్టర్ రంజని

కాచిగూడ: విద్యార్థులు పూర్తిగా అధ్యాపకులు, పాఠ్యపుస్తకాలపైన ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం డాక్టర్ రంజని అన్నారు. కాచిగూడలోని బద్రుకా కామర్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీలో ‘బిజ్‌కామ్ -2023’ పేరుతో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఇంటర్ కాలేజ్యేట్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ పెస్ట్ ముగింపు వేడుకలు గురువారం నిర్వహించారు. నగరంలోని దాదాపు 50 కళాశాలలకు చెందిన 4500 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలో ముందుకెళ్లాలని సూచించారు. కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ నీచ రాజకీయాలు దుర్మార్గం

కవాడిగూడ: సైనికుల వీరమరణాలు, త్యాగాలను బీజేపీ నీచ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం దుర్మార్గమని ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డు సుధాకర్ అన్నారు. జమ్ము కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఇటీవల చేసిన వాఖ్యలపై బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సత్యపాల్‌మాలిక్ వాఖ్యల ఆధారంగా పుల్వామా ఘటనను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారించాలని డిమాండ్ చేస్తూ ఆమ్ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం ట్యాంక్‌బండ్ మిలట్రీ ట్యాంక్ వద్ద ప్లకార్డులతో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.



ట్యాంక్‌బండ్ మిలట్రీ ట్యాంక్ వద్ద ప్లకార్డులతో నిరసన చేస్తున్న ఆప్‌నేతలు

‘నిరంతరం పోరాడిన నేత సునీత్ చోప్రా’



సునీతచోప్రాకు నివాళులర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప నేత సునీత్ చోప్రా అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సునీత్‌చోప్రాకు నివాళి అర్పించారు. బి.వెంకట్ మాట్లాడుతూ ఉన్నత వర్గంలో పుట్టి ఉన్నత చదువులు చదివినప్పటికీ అణగారిన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని మదర్ డెయిరీ పార్కులో బోర్ వెల్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని కోరుతూ గురువారం బాగ్‌లింగంపల్లి ఎంఐజీ-2 పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ త్వరలో పార్కును సందర్శించి బోర్‌వెల్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు ఈ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మూసీనది బఫర్‌జోన్‌లో కంటైనర్ తొలగింపు

అంబర్‌పేట: మూసీనది బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాన్ని అధికార యంత్రాంగం తొలగించింది. గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసీనదిలో నాలుగురోజుల క్రితం బఫర్‌జోన్‌లో రాత్రికి రాత్రి ఓ కంటైనర్‌ను వేశారు. సమాచారం అందుకున్న అంబర్‌పేట రెవెన్యూ యంత్రాంగం పోలీసుల సహకారంతో తరలించారు.

అవార్డు గ్రహీతను సత్కరించిన ఎమ్మెల్యే



కాచిగూడ: బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన బొజ్జ రాజును దళిత యువరత్న అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అభినందించారు. గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి అభినందించారు.

రాంనగర్ చౌరస్తాలో అన్నదానం

ముషీరాబాద్: వాసవి సేవా సమితి రాంనగర్ ఆధ్వర్యంలో గురువారం అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి నాయకులు బుక్కా రమేష్‌గుప్తా, పల్లా శివకుమార్ సహకారంతో రాంనగర్ చౌరస్తాలో జరిగింది. ముఖ్య అతిథిగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, కోకన్వీనర్ నవీన్‌గౌడ్ హాజరయ్యారు.



ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం రాత్రి అంబర్‌పేట ప్రధాన రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుశీల్ రాజ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ కార్యాలయం ఉద్యోగులు మోహన్‌రావు, నర్సింగ్, టీజేఎస్ నేత మెరుగు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కలెక్టర్ అనుమతి మేరకే భవనం కూల్చివేత

సికింద్రాబాద్: జిల్లా కలెక్టర్ కార్యాలయ అనుమతి పొందిన తర్వాతే సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పాత భవనం కూల్చివేత పనులు ప్రారంభించామని జీ.కృష్ణమూర్తి అండ్ సన్స్ కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు అనుమతి తెచ్చారని చెప్పారు. అప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాల భవనంలోనే కళాశాలల తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులు చెట్ల కింద పాఠాలు నేర్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన పద్మారావుగౌడ్ సిఫారసు మేరకు కొత్త భవన సముదాయం నిర్మాణం కోసం రూ.29.75 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పాత భవనాన్ని మరమ్మతు చేసే పరిస్థితులు ఎంత మాత్రం లేవని ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగానే కొత్త భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కళాశాల, విద్యాశాఖకు చెందిన పలువురు ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణపు అంచనా వ్యయం ఖరారు చేశారన్నారు. నిర్మాణం కోసం తమ సంస్థ అనుమతులు పొందడంతోపాటు, పాతభవనాల కూల్చివేతలకు సైతం జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇదిలా ఉండగా సోషల్ డెమోక్రెటిక్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి బృందం పాఠశాలను సందర్శించి కమీషన్ల కోసమే విద్యా భవనాన్ని నిర్మిస్తున్నట్లు రాజకీయ విమర్శలు చేయడం విచారకరమన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించి పూర్తి విషయాలు తెలుసుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేసి, భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేపై బురదజల్లే విధంగా ఎస్‌డీఎఫ్ ప్రతినిధులు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు.

ఫుట్‌పాత్‌పై చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ముషీరాబాద్: ఫుట్‌పాత్‌పై చెట్టుకు కేబుల్ వైర్‌తో ఉరి వేసుకుని ఓ వ్యక్తి(35) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భోలక్‌పూర్ డివిజన్, ముషీరాబాద్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్‌కు వెళ్లే మార్గంలో దేవుడి తోట వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ వైర్‌తో ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించిన స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్..

యువకుడి ఆత్మహత్య



కమల్ మృతదేహం

ముషీరాబాద్: మానసిక వేదనతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపిన మేరకు.. రాంనగర్‌లోని హరినగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఉద్యోగి ఉదయ్‌కుమార్ కుమారుడు డి.కమల్(26) ఐఈఎల్‌టీఎస్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. 2017లో నందిని అనేయువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే కొద్ది రోజులకే మనస్పర్ధలతో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి కమల్ డిప్రెషన్‌కు గురయ్యాడు. గురువారం ఉదయం 8 గంటలకు హరినగర్‌లోని తన నివాసంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో లోపలి నుంచి తలుపు పెట్టుకొని నందినికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో ఆమె కమల్ తల్లికి విషయం చెప్పింది. ఆమె స్థానికుల సహాయంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముషీరాబాద్: రాంనగర్‌లోని దాయార మార్కెట్ సమీపంలో కార్తికేయ మొబైల్ షాపు దగ్గర 40-45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఫిట్స్‌తో స్పృహతప్పి పడి ఉన్నాడు. స్థానికులు 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

బాత్రూమ్‌లో జారిపడి గర్భిణి మృతి

కాచిగూడ: ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో జారి పడి గాయపడిన ఓ గర్భిణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన మేరకు.. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన హేమంత్ ప్రైవేట్ ఉద్యోగి. ఆయన భార్య కల్పన (28) ఆరు నెలల గర్భవతి. సీమంతం నిమిత్తం ఆమెను స్థానికంగా ఉండే సంజీవయ్యనగర్ లోని పుట్టింటికి 15 రోజుల క్రితం అతను పంపాడు. గురువారం ఉదయం ఆమె బాత్‌రూమ్‌లో జారిపడింది. గాయాల పాలైన ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఫిట్స్, గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభినవ తులసీదాసు ఎమ్మెస్ రామారావు

చిక్కడపల్లి: సుందరదాసు ఎమ్మెస్ రామారావు అభినవ తులసీదాసు అని చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం చైర్మన్ జి.మురళీ ప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథం అన్నారు. ఎమ్మెస్ రామారావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆలయం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేవాలయానికి రామారావుకు ఉన్న అనుబంధం ఎంతో గొప్పదన్నారు.

‘ఆ నెత్తుటి మరకల వెనుక పగిలిన గుండెలు’



సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇంద్రవెల్లి ఆదివాసీ నెత్తుటి తిలకం, పచ్చని అడవుల్లో పారిన త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ నెత్తుటి మరక వెనుక పగిలిన గుండెలు ఉన్నాయని ఇంద్రవెల్లి నిజ నిర్ధారణ కమిటీసభ్యులు పాశం యాదగిరి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ‘ఇంద్రవెల్లి ఓ నెత్తుటి సాక్ష్యం అని, ఇంద్రవెల్లి అమరత్వానికి 42 ఏళ్ల సందర్భంగా’ స్మారకోపాన్యాసం జరిగింది. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ ఇంద్రవెల్లి పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కూడు, గుడ్డ లేని జనానికి అంత తెగింపు ఎందుకు ఎలా వచ్చిందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ అస్తిత్వానికి నిలువెత్తు చిరునామా రాంజీ గోండ్, కొమురం భీమ్ అని అన్నారు. పౌర హక్కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జి.లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంద్రవెల్లి సమీప ప్రాంతాల ఆదివాసీలు తరతరాలుగా అక్కడి అడవి సంపద మీద సర్వ అధికారాలు కలిగి ఉన్నారన్నారు.కార్యక్రమంలో నిరసం నేత స్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కన్వీనర్ నాగభూషణం పాల్గొన్నారు.

నిత్య జీవితంలో స్టాటిస్టిక్స్ పాత్ర కీలకం



అతిథులను సత్కరిస్తున్న కళాశాల కార్యదర్శి వినోద్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మనిషి జీవితంలో స్టాటిస్టిక్స్ పాత్ర గణనీయమైనదని డాక్టర్ యుగేందర్ అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ యుగేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అనేక రకాల వ్యాపార లావాదేవీల్లో స్టాటిస్టిక్స్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగ అధిపతి డాక్టర్ ఎం.రాఘవేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

రాంగోపాల్‌పేట్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు పిల్లలను సమ్మర్ క్యాంపుల్లో చేర్పించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం ఎస్పీరోడ్‌లోని గురుమూర్తి స్విమ్మింగ్‌పూల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న జిమ్‌ను పరిశీలించి నిర్వాహకుల కోరిక మేరకు అత్యాధునిక పరికరాలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బేగంపేట, అమీర్‌పేట్, సనత్‌నగర్‌లలో స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయని ఆసక్తి ఉన్న వాళ్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్పొరేటర్లు మహేశ్వరి, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడి, ఈఈ సుదర్శన్ శ్రీహరి, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.



పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి : హుస్సేన్ సాగర్‌కు అనుసంధానంగా ఉన్న డ్రైన్ పైపులైన్ పగిలి లీకేజీ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కారించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అధికారులతో పేర్కొన్నారు.గురువారం చిక్కడపల్లి జనతపార్క్, హెచ్ఎస్ఆర్ అరుట్ల అపార్ట్‌మెంట్ రోడ్డులో రోడ్లపై పైప్‌లైన్ లీకై మురుగునీరు పారుతున్న ప్రాంతాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. చిక్కడపల్లి నుంచి త్యాగరాయగానసభ రోడ్ల గుండా బాపూనగర్ వరకు నీరు లీకే రోడ్లన్నీ బురదమయంగా మారాయన్నారు. స్థానికులకు, పాదచారులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారన్నారు. పైప్‌లైన్‌ను వేంటనే క్రమబద్ధీకరించి సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.